# జానపద కళారూపాలకీ, నాటకరంగానికి సజీవ వంతెన

- జయధీర్ తిరుమలరావు

ఆంగ్లేయ అధికారులు భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో జానపద సాహిత్యాన్ని సేకరించారు. మొదటి దఫాలో ఈస్టిండియా కంపెనీ అధికారులు ఈ పని ప్రారంభించారు. మెకంజీ, యం.జె. బోయల్, కిట్టెల్ వంటివారు ఎంతో శ్రమించారు. మన గ్రామీణ నోటిసాహిత్యం విలువని గుర్తించారు. వివిధ గేయాలను సేకరించి అనువదించారు. చక్కని వ్యాసాలు రాసి విదేశీ పత్రికలలో చాటారు. చిన్న గేయాలు మొదలు పలనాటి వీరచరిత్ర, సర్వాయి పాపన్న వంటి ఎన్నో వీరగాథలను సైతం సేకరించి అధ్యయనం చేశారు. వేమన వంటి ప్రజారచయితను గుర్తించిన సి.పి. బ్రౌన్ ఆ పద్యాలను అనువదించారు. తెలుగులోని నోటిసాహిత్యాన్ని, ఆ కవుల పద్యాలను అచ్చువేసినవారూ ఆంగ్లేయులే.

తెలుగు పండితకవులు ఈ సాహిత్యాన్ని గుర్తించడానికి ఇష్టపడలేదు. ఈ పాటలను, వీరగాథలను పాడేవారిని, అమోఘమైన ప్రదర్శనలు ఇచ్చే కళాకారులని, వారి విశిష్టతలను ఏమాత్రం గుర్తించలేదు. వీరి సంగీతం, గానం, పురాణసాహిత్యం, సామాజికసాహిత్యం వంటివాటి ప్రసక్తి కూడా చేయలేదు. విదేశీపాలకులకి వీటి గురించి తెలియకపోవచ్చును కాని వీరికి సహాయకులుగా పనిచేసే స్థానికపండితులకి తెలియకపోవడానికి ఎలాంటి ఆస్కారం లేదు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతినిత్యం మారుమోగే ఈ గాథలు, ప్రదర్శనల గురించి తెలిసినా, వాటిని నిరంతరం చూసినప్పటికీ ఆనాటి చాలామంది కవులు వీటిని ఎక్కడా పేర్కొనలేదు. అందుకు కారణం ఏమిటి అని ప్రశ్నించుకోవడం అవసరం. ఈ మొత్తం సాహిత్యానికి, ప్రదర్శనలకి, కళలకి అన్నింటికి కిందివర్గాలు, అంటరానివాళ్ళే సృష్టికర్తలు.

ఆంగ్లేయుల కృషిని చూసిన మన పండితులు జానపదసాహిత్యం పట్ల అభినివేశం చూపారు. నందిరాజు చలపతిరావు 1900 ప్రాంతంలోనే వందలాది స్త్రీల పాటలు సేకరించారు. వీటిని మూడు భాగాలుగా అచ్చువేశారు. అందుకు వారిని అభినందించవలసిందే. కాని కిందివర్గాల స్త్రీల, శ్రమజీవి మహిళల సాహిత్యాన్ని వారు ఏమాత్రం సేకరించలేదు. శ్రీపాదవారు శిష్టరామాయణాలతోపాటు, ఆయా వర్గాలకు చెందిన స్త్రీల రామాయణ పాటలను సేకరించారు. ఈ పండితులలో పెద్దలే ఎక్కువ. ఒక్క నేదునూరు గంగాధరం తప్ప. వీరు ప్రజాసాహిత్యానికి, జానపద సాహిత్యానికి చేసిన కృషి గుర్తింపదగినది. వీరి తరువాత విద్యాత్మకరంగం వెలుపల ఉండి ఎంతోమంది పండితులు జానపదసాహిత్యానికి సేవచేశారు. సురవరం ప్రతాపరెడ్డి వంటివారు ఎందరో జానపదసాహిత్య విశిష్టతని, విలక్షణతని లోకానికి వెల్లడించారు.

సుమారు వందేళ్లుగా జానపదసాహిత్యరంగంలో పరిశోధన జరిగినా పాఠ్యాంశాలుగా బడులు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకి దూరంగానే ఉండిపోయింది. 1918లో ఏర్పాటయిన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1940లో తెలుగుశాఖ ప్రారంభం అయ్యింది. 1972లో మాత్రమే ఆచార్య బి. రామరాజుగారి చొరవతో ఎమ్మే తెలుగులో ఒక ఐచ్ఛికాంశంగా జానపదసాహిత్యం ప్రవేశపెట్టబడింది. 1958లో రామరాజుగారు మొదటిసారిగా

జానపదసాహిత్యంపై పరిశోధించి పిహెచ్.డి. పట్టా పొందారు. అది మొదలు చాలా విశ్వవిద్యాలయాలలో జానపదసాహిత్యం ఒక పేపర్‌గా, తప్పనిసరి పేపర్‌గా ఉంచబడింది. చాలామంది పరిశోధక విద్యార్థులు ఈ రంగంలో యం.ఫిల్., పిహెచ్.డి. పరిశోధనలు చేయడానికి ముందుకువచ్చారు. కేవలం తెలుగుశాఖలోనే కాదు, హిందీ, ఇంగ్లీషు వంటి సాహిత్యశాఖలు, సోషియాలజి, చరిత్ర, ఆంత్రొపాలజి వంటి ఇతర శాఖలలో జానపదరంగానికి చెందిన అనేక కొత్తకొత్త అంశాలలో పరిశోధనలు చేయడానికి ఆసక్తి చూపారు.

ఎనిమిదో ఏట నుండి శర్మగారు నాటకాలు వేశారు. ఉన్నతవిద్య అభ్యసిస్తున్నపుడు కూడా నాటకాలను వదలలేదు. నాటక రచన, ప్రదర్శనతో పాటు పరిశోధనరంగంలో తనదైన ముద్రవేశారు. గుంటూరు ఎ.సి. కళాశాల నుండి 1960లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరారు. కాకతీయ సాంస్కృతికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి కార్యకలాపాలలో వీరు దగ్గరగా పాల్గొన్నారు. వారి ఆధ్వర్యంలో 'నాట్యకళ' పత్రిక నడిచేది. అందులో జానపద ప్రదర్శనలు, సంగీతవాద్యాల గురించి ఎన్నో వ్యాసాలు వచ్చేవి. శర్మగారు కూడా నాటక వ్యాసాలు రాశారు.

తెలుగు నాటకరంగంపై లోతుగా పరిశోధిస్తున్న సమయంలో జానపదకళలపై ఆసక్తి పెరిగింది. జానపదనాటకాలు ఉన్నాయని, అవి కొన్ని వేల ఏళ్ళ నుండి ప్రజలలో మంచి ఆదరణ, పొందాయన్నది అందరికీ తెలిసిన విషయమే. భరతుని 'నాట్యశాస్త్రం' లో కూడా వీటిని పేర్కొన్నారు. వీటిని వీథినాటకాలని, గ్రామీణ నాటకాలని, దేశి రూపకాలని వ్యవహరిస్తారు. మార్గనాటక రీతులకన్న దేశి-జానపద నాటకాలు ప్రాచీనమైనవి. గిరిజన నాటకాలు కూడా వివిధ రూపాలలో కానవస్తాయి. వేటాడడాన్ని, క్రూరజంతువుల నుండి రక్షించుకోవడాన్ని నృత్యరూపక ప్రదర్శనల ద్వారా పిల్లలకు చూపడం నుండి ఇవి ప్రారంభమయ్యాయి. కావ్యప్రబోధ రచనలు ఆస్థానకవులు చేసేవారు. అక్కడ జానపదకవులకి స్థానంలేదు. కాని మార్గనాటకాల కన్నా దేశినాటకాలకి ఆస్థానంలోనే ఎక్కువ ఆదరం లభించేది. ఈ సంప్రదాయం అన్ని భాషలలో, అన్ని ప్రాంతాలలో నేటికీ కొనసాగుతున్నాయి. వీటిని చిందు అనీ, వీధిభాగోతం అనీ, యక్షగానాలు అనీ, దేశిరూపకాలని పిలుస్తారు. ఐతే ఈ పదాలు పర్యాయపదాలు కాదు. వేటికవే స్వరూపస్వభావాలలో, రూపం, ఇతివృత్తంలో వేరువేరు. వీటిలో సంగీతం, ఆహార్యం కూడా ప్రత్యేకించి ఉంటాయి. ముఖ్యంగా పేర్కొనవలసింది ఆయా ప్రదర్శనలకు ప్రేక్షకులు వేరువేరుగా ఉంటారు. కులం, మతంవారీగా అనుబంధకళలుగా, ప్రదర్శనలుగా వీటిని పేర్కొనవచ్చును. ఈ ప్రదర్శకులకు ఒక కులం, కులంమీద ఆధారపడిన ఉపకులం, మతం, మతవిభాగం, క్రతు కర్మకాండ, పూజ, కులపురాణ ప్రదర్శన వంటి అంశాలకు సంబంధించి ప్రత్యేకమైన కట్టుబాటు, శిష్యపరంపర, కులజన ఆధారిత రూపకాలు విడివిడిగా ఉంటాయి. వీటిని ప్రదర్శించేవారిలో ఎక్కువగా వృత్తినాటక ప్రదర్శకులు ఎక్కువ. కొన్ని కొత్తకులాల పేర్లు, వాటికి అనుబంధించిన ప్రదర్శనలు ఉంటాయి.

ఈ ప్రదర్శకులే గురువులుగా, పూజారులుగా, పురోహితులుగా, వైద్యులుగా ఉంటారు. వీరిలో చాలామంది సంచారులు. కాబట్టి వీరిని కేవలం నటులు అని అనలేం. ఆయా సమాజాలలో వారిది బహుముఖ పాత్ర. ఐతే వీరి ప్రదర్శనలకు ప్రత్యేకమైన రంగస్థల వేదిక అంటూ ఉండదు. సందర్భాన్ని బట్టి ప్రదర్శన జరుగుతుంది. నిజానికి అవి మనకు నాటక ప్రదర్శనలు. కాని ప్రదర్శకులకు, శ్రోతలు, ప్రేక్షకులు, పాల్గొనే ప్రజలకు అది పూజ, బలి, కర్మకాండ, ఆచారం, ఏదైనా కావచ్చు. ఐనా అందులో నాటకీయత, సంగీతం, సంభాషణ, కథ

వంటి అన్ని అంశాలు ఒక గొప్ప ప్రదర్శనగానే భాసిస్తాయి. ఇలాంటి రూపకసాహిత్య ప్రదర్శనల గురించి 'నాట్యకళ' తదితర పత్రికలలో చర్చింపబడేది. పరిశోధక జిజ్ఞాసువు కాబట్టి శర్మగారు తొందరగా వాటిపట్ల ఆకర్షితులయ్యారు. ఈ కళారూప ప్రదర్శనలను 'జననాట్యాలు' అని, శర్మగారు తాను రాసిన 'జానపద నాటక వికాసం' వ్యాసంలో పేర్కొన్నారు. ఈ వ్యాసంలో దేశీరూపకాల గురించి నాటక దృక్కోణం లోంచి పరామర్శించారు. దేశిరూపకాలలో సంగీత ప్రధానమైన నాటకాలు, నృత్యప్రధానమైన నాటకాలు ఉన్నాయని ప్రతిపాదించారు. భక్తి ప్రధానమైన నాటకాలను, ధార్మిక నాటకాలుగా పేర్కొన్నారు. తెలుగులో 'భామాకలాపం' సంగీతనృత్య ప్రధానమైన రూపకం. రానురాను ఇది కూచిపూడి నృత్యంగా మారిపోయింది. అంటే జానపదీయ రూపకం శాస్త్రీయనృత్యంగా మారింది. అలాగే యుద్ధనృత్యం, వీరనాట్యం, ఆంధ్రనృత్యంగా పేరుగాంచింది. శారదవాద్యం వాయిస్తూ పాడే కథని వేదికమీద ప్రదర్శించినప్పుడు 'బుర్రకథ' అయ్యింది. వైష్ణవాలయంలో ఒక కథకుడు లేదా పౌరాణికుడు చెప్పే కథకు తానే సంగీతం, నటన, నృత్యభంగిమలను కలిపి కథ చెబితే అది 'హరికథ' గా మారింది. బుర్రకథ, హరికథ అటునిటు వందేళ్ళకిందటి జానపద కళారూపాలుగా పేర్కొనవచ్చు.

శర్మగారు 'జానపద నాటక వికాసం' వ్యాసంలో దేశీయ వికాసంలోని మూడు ముఖ్య దశలు ఉన్నాయని పేర్కొన్నారు. వాటిలోని ఇతివృత్తం గురించి వివరించారు. పాత్రల గురించి, పాత్రపోషణ గురించి తెలిపారు. భాష, సంగీతం, హాస్యం, సంభాషణలు ఎలా ఉంటాయో చక్కగా చెప్పారు. నాటకకళ అధ్యయనం కాబట్టి జానపదనాటకాలు ప్రదర్శన రీతులు గురించి అంతకుముందు ఎవరూ చెప్పని అంశాలను చర్చించారు.

జానపద ప్రదర్శనలకి వేదిక ఉండదు. రంగస్థల అలంకరణ ఆనాటి సందర్భానుసారంగా మాత్రమే ఉంటుంది. ఎలాంటి తెరలు ఉండవు. ప్రారంభంలో మాత్రమే ఒక తెల్లనిగుడ్డ పట్టుకుని ఉంటారు. ప్రార్థన సమయంలో పౌరాణిక దైవాలు, పాత్రలు ఉంటాయి కాబట్టి, ఆ తెరని తీయగానే పాత్రధారులు అంతా కలసి ప్రార్థన చేస్తారు. ఆ తెర మళ్ళీ కనబడదు. పాత్ర ప్రవేశం సూత్రధారి లేదా ఇతర పాత్రధారి సూచన చేసి పిలుస్తాడు. ఆ పాత్ర రంగప్రవేశం చేసి తన గురించి తాను నృత్యం చేస్తూ, సంగీతం వాయిస్తూ పద్యంలోనో, గేయంలోనో వివరిస్తాడు. ఎలాంటి వేదిక, రంగస్థల అలంకరణ లేకుండానే శ్రోతలను, ప్రేక్షకులను ఆకట్టుకునే రీతిలో ప్రదర్శన నడుస్తుంది.

ఆధునిక నాటక ప్రదర్శనలో ప్రయోగాత్మకంగా జానపద నాటకాల నుండి గ్రహించి పేరుప్రఖ్యాతులు పొందారు. ఉదాహరణకు గొల్లసుద్దులు, ఒగ్గుకథ వంటి ప్రదర్శనలలో వేదిక నుండి "ఓరి మల్లన్నా, ఎక్కడున్నావ్. రారా, కథ మొదలైతాంది" అంటారు. ప్రేక్షకులలో కూర్చున్న మల్లన్న ఆవలిస్తూ లేచి వేదిక దగ్గరకు వస్తాడు. ఇలాంటి అంశాన్ని మరాఠీ, కన్నడ ఆధునిక రంగస్థలం స్వీకరించింది. ఇలాంటి ఎన్నో సంప్రదాయ పద్ధతులను ఆధునీకరించారు. శర్మగారు 1970 ప్రాంతం నుండి మోహన్‌రాకేశ్, యాదవ్ సర్కార్, విజయ్ టెండూల్కర్, హబీబ్ తన్వీర్, గిరీశ్ కర్నాడ్ ఇలాంటి ఎంతోమంది నాటకప్రయోక్తలు ఎన్నో ప్రయోగాలకు స్థానం కల్పించారు.

బాదల్ సర్కార్ వంటి అనేకులు రంగస్థలాన్ని నిరాకరించారు. వీధిలోనో, ఒక సెంటర్‌లోనో నాటకాలు వేశారు. ప్రేక్షకులని కూడా పాత్రధారులుగానో, వారిని ప్రసక్తి చేయడం ద్వారానో తను నాటకంలో భాగం చేసేవారు. ఇతివృత్తంలోను, నాటక రచనలోను, ప్రదర్శనలోను ఇలాంటి కొత్తదనాన్ని దగ్గరనుండి చూశారు

కాబట్టి శర్మగారు జానపదకళారూపాల మీద అభిమానం పెరిగింది. ఈ అభిమానం పరిశోధనస్థాయికి చేరింది. అధ్యయనం చేయాలంటే క్షేత్రపర్యటన అతిజరూరు. ఆ పని చేస్తూనే 'జానపదకళారూపాల ప్రదర్శన'లను నగరం నడిబొడ్డున నిర్వహించడానికి నడుంకట్టాడు.

గిరీశ్‌కర్నాడ్ 'తలదండ'లో, 'నాగమండల' వంటి నాటకాలలో జానపదగాథల మూలాలు ఉన్నాయని గ్రహించారు. కేవలం ప్రదర్శనలనే కాదు, కథల ప్రభావం కూడా నాటకరచనలో ఉండటాన్ని పసిగట్టారు. అలా జానపద విజ్ఞానంపట్ల గౌరవం, ఆదరణ పెంచుకున్నారు. ఈ రకంగా కేవలం జానపదసాహిత్యంలో పరిశోధన పట్టాకోసమో, కేవలం జానపద సాహిత్య పాఠ్యాల సేకరణ కోసమో పరిమితమై ఆ రంగంలో అభినివేశం చూపలేదు. నాటకప్రదర్శనల పట్ల అభిరుచిలో ఒక ప్రయోక్తగా, రచయితగా జానపదకళల ఆరాధకుడయ్యాడు. 'హయవదన' రెండు మౌఖిక జానపదకథల నాటకరూపం. 'హయవదన' (సగం గుర్రం - సగం మనిషి) నాటకంలోని ప్రవేశికలో "జానపద కథ" పాత్రని జానపదకథల గొప్పదనానికి ప్రతీకగా మలిచాడు. నాటకాల్లో నవ్యత, ప్రయోగశీలతలని జానపదాల నుంచి తీసుకోవడం తప్ప మరో మార్గంలేదని శర్మగారు భావించారు. స్థానిక జానపదరూపక విధానాలను గ్రహించి రక్తికట్టించిన విధానం గొప్పది. దీనిని మరింత లోతుగా అధ్యయనం చేయడానికి జానపద పండితులైన బి. రామరాజు, నాయని కృష్ణకుమారి వంటి పెద్దలతో కలసి పనిచేశారు. తనకన్నా చిన్నవాళ్ళకి ఈ రంగంలో గురువు అయ్యారు.

తెలుగు జానపద కళారూపాలకు జాతీయస్థాయిలో గుర్తింపు తేవడంలో కృషిచేసినవారిలో శర్మగారు ఒకరు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1982లో నాటకశాఖ ఏర్పడింది. దానికి శర్మగారే మొదటి శాఖాధిపతి. శర్మగారు తన 'నరజాతి చరిత్ర సమస్తం' అనే నాటకంలో నాలుగైదు జానపద కళారూపాలలోని మూలకథలను వాడుకుని నాటకంలో జరుగుతున్న సంఘటనలను వివరించడానికి, వ్యాఖ్యానించడానికి వాడుకున్నారు.

జానపద కళారూపాలలో అతి ప్రాచీనమైన కళారూపం తోలుబొమ్మలాట, కొయ్యబొమ్మలాట. మనిషి తనకి ప్రతిరూపంగా తోలుబొమ్మని సృష్టించాడు. వాటిలో వినోదం, విషయజ్ఞానం పొందడానికి ప్రదర్శనలు తయారుచేశాడు. మన రాష్ట్రంలోని తోలుబొమ్మలాట ఆయనని విశేషంగా ఆకట్టుకుంది. న్యూఢిల్లీలోని సంగీతనాటక అకాడెమీ వారికి 'తోలుబొమ్మలాట' అనే ఇంగ్లీషు పుస్తకం రాసిచ్చాడు. అక్కడితో ఆగిపోతే నాగభూషణశర్మ ఎలా అవుతాడు? తోలుబొమ్మలాటలోని "Association for the promotion of puppetry in A.P" అనే సంస్థను 1986 ప్రాంతంలో ఏర్పాటుచేశారు. దానికి ఆయన అధ్యక్షులు. ఈ కళారూపం ద్వారా పిల్లలకి విద్య, వినోదం కలిగించడానికి ఎన్నో ప్రయోగాలు, కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. "Educational puppetry for young teachers" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి నాలుగురోజులు నిర్వహించారు. రామాయణ కథని, అలాద్దీన్ కథని తీసుకుని ప్రదర్శనలు ఇప్పించారు. ఎన్నో సదస్సులు ఏర్పాటుచేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సదస్సులలో, ప్రదర్శనలలో పాల్గొన్నారు. విదేశాలలో జానపదకళారూపాల గురించి ప్రసంగించారు. జానపదాలకు సంబంధించి ఈ కృషి అంతా ఒంటిచేత్తో చేయడం గమనార్హం.

నేను తెలుగువిశ్వవిద్యాలయం ప్రచురణల సంచాలకునిగా ఉన్నప్పుడు వారు రాసిన "Folk performing Arts of A.P - 1995" అనే ఇంగ్లీషు పుస్తకం అచ్చయ్యింది. అప్పటిదాక తెలుగులో ఉన్న 65 కళారూపాల

సమాచారం ఆంగ్లపరిశోధకులకి అందుబాటులోకి వచ్చింది. శర్మగారు 'ప్రదర్శన'కి మారుపేరు. అందుకే సుమారు మూడువందల జానపద కళారూపాల నుండి ప్రదర్శన కళారూపాలను ఏరికోరి ఎంపిక చేశారు. నిజానికి జానపదవిజ్ఞానంలో కళలపై అధ్యయనం చేయడానికి, అటుగా దృష్టి మరల్చడానికి ఆయన కృషి దోహదపడింది.

పాశ్చాత్య జానపద పరిశోధకులు ఎన్నో సిద్ధాంతాలు చేశారు. అందులో "performance theory" ఒకటి. కాని తెలుగు నేలమీద ఈ ప్రదర్శన సిద్ధాంతానికి తనదైన ఆలోచనలతో దేశీయమైన అధ్యయనరూపం ఇచ్చి, ఈ సిద్ధాంతానికి అన్వయం, ఔపయోగికవిధానం కల్పించారు. కళారూపాలను నాటకవిద్యార్థులకు, నాటకరంగ పెద్దలకు కూడా ఎక్కువమొత్తంలో పరిచయం చేసిందికూడా ఆయనే.

ఇంగ్లీషు సాహిత్యం చదివి, ఆంగ్లశాఖలో పనిచేస్తూ తెలుగు సమాజానికి జానపద కళారూపాలపై ఎనలేని అభిమానాన్ని కలిగించారు. కేవలం పరిశోధించి పట్టా పొందడం ముఖ్యంకాదు. వాటిని ఉపయోగించుకుని ఇతర కళలకి పుష్టి కలిగించడం ముఖ్యం. ఆ పని శర్మగారు చేశారు. జానపద కథలలోని విలక్షణతని కూడా నాటకప్రక్రియకు జోడించి రెంటికీ - గుర్తింపుతెచ్చారు. ఈ పని సంప్రదాయ, యాంత్రిక పరిశోధకులు ఎవరూ చేయని పని. ఒక ప్రయోజనం ఆశించి, అధ్యయనం చేసి, వాటికి ప్రచారం కలిగించినవారిలో శర్మగారు ముందువరుసలో ఉంటారు. అందుకే వారికి అభినందనలు.



బొమ్మలాట ఫెస్టివల్ నిర్వాహకునిగా..... (1986)